సాక్షి
నిర్మల్
బుధవారం ၊ 22 ၊ మార్చి ၊ 2023



అడవులను సంరక్షించాలి
అడవుల సంరక్షణ అందరి బాధ్యత అన్నారు మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. 8లో▸



అమ్మ చెంత ఆత్మహత్యాయత్నం
బాసర సరస్వతి అమ్మవారి సన్నిధిలో నిజామాబాద్ జిల్లాకు చెందిన ప్రసాద్‌గౌడ్ మంగళవారం ఆత్మహత్యాయత్నం చేశాడు. పదునైన కత్తితో మణికట్టు కోసుకుని రక్తార్పణం చేశాడు. 8లో▸

గరిష్టం/కనిష్టం
33.1/21.3
వాతావరణం
ఆకాశం కొంతమేర మేఘావృతమౌతుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. వర్షం కురిసే అవకాశం లేదు. మధ్యాహ్నం వేడిగా, ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఇంటర్ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన డీఐఈవో



పరీక్షకేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఐఈవో

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలతోపాటు ఏఆర్ఎస్ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ పరీక్షలను డీఐఈవో పరుశురాంనాయక్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పరీక్షలకు విద్యార్థుల హాజరు, కేంద్రాల్లో సౌకర్యాలు, పరీక్షల నిర్వహణ తీరు తదితర విషయాలను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా డీఈసీ మెంబర్ రవికిరణ్, సీఎస్‌లు రజిత, హమీద్ తదితరులు ఉన్నారు.

వార్డెన్, వాచ్‌మెన్‌పై ఫిర్యాదు



అధికారికి ఫిర్యాదు చేస్తున్న ఉపసర్పంచ్

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ గ్రామంలోని బీసీ బాలుర వసతిగృహాన్ని జిల్లా అసిస్టెంట్ బీసీ అభివృద్ధి అధికారి గంగాధర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ దొనికెని సాగర్‌తోపాటు గ్రామ నాయకుడు రాజు స్థానిక వార్డెన్‌తోపాటు వాచ్‌మెన్‌పై జిల్లా అధికారికి ఫిర్యాదు చేశాడు. వార్డెన్, వాచ్‌మెన్ స్థానికంగా ఉండడం లేదని తెలిపారు. ఆరుబయట మెనూ బోర్డు ఏర్పాటు చేయలేదని పేర్కొన్నారు. మెనూ ప్రకారం భోజనం పెట్టకుండా నీళ్ల పప్పుతో భోజనం పెడుతున్నారని ఫిర్యాదు చేశారు. స్పందించిన గంగాధర్ విచారణ చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రేవంత్‌రెడ్డిని కలిసిన ఖానాపూర్ నాయకులు



రేవంత్ రెడ్డితో చిన్నం సత్యం

ఖానాపూర్: ఖానాపూర్ నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలతోపాటు ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలతో ప్రజలు ఇక్కట్లు పడుతున్నందున ఖానాపూర్‌లో పాదయాత్ర చేయాలని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని ఆ పార్టీ నాయకులు కోరారు. మంగళవారం హైదరాబాద్‌లో కలిసి ఈమేరకు విన్నవించారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన బూటకపు హామీలు అమలుకాక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. పాలకుల వైఫల్యంతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై మేమున్నామనే భరోసా కల్పించేలా యాత్ర చేయాలని కోరారు. రేవంత్‌ను కలిసిన వారిలో మున్సిపల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ చిన్నం సత్యం, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు కిశోర్‌నాయక్ ఉన్నారు.

అంచనాల్లోనే నష్టం!

- అన్నదాతకు అందని పరిహారం
- వేల ఎకరాలు పోయినా రూపాయి సాయమందని వైనం..
- తాజాగా చెడగొట్టు వానలు
- దెబ్బతిన్న మక్క, నువ్వు పంటలు

ఇటీవల పంటనష్టం వివరాలు..

పంటలు	నష్టపోయిన రైతులు	ఎకరాల్లో నష్టం..
మొక్కజొన్న	1,568	2,323
నువ్వు	284	389



మూడు రోజుల క్రితం కురిసిన వడగండ్లకు లోకేశ్వరం మండలంలో నేలవాలిన మొక్కజొన్న చేను

నిర్మల్: ఆరుగాలం కష్టపడే రైతన్నకు నష్టాలూ వెన్నంటే ఉంటాయి. కాలం పెట్టే పరీక్షను తట్టుకుని మార్కెట్లోకి పంట చేరితేనే తన కష్టానికి విలువ దక్కుతుంది. కానీ అంతలోనే ప్రకృతి ముంచేస్తోంది. ఇలా జరిగిన ప్రతిసారీ ప్రభుత్వం నష్టం లెక్కలు కడుతోంది. అంచనాల్లో వేల ఎకరాల్లో పంట నష్టాన్ని చూపుతున్న సర్కారు సదరు రైతులకు రూపాయి పరిహారం కూడా ఇవ్వడం లేదు. ఏటా కనీసం రెండుసార్లు పంటలు దెబ్బతింటున్నాయి. కానీ ఒక్కసారి కూడా ప్రభుత్వం కరుణ చూపడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా గాలివానతో జిల్లాలో మక్క, నువ్వు పంటలతోపాటు మామిడి దెబ్బతిన్నాయి.

చెడగొట్టు వానలతో..
పంటలు చేతికొచ్చే సమయంలో చెడుగొట్టు వానలు పరేషాన్ చేస్తున్నాయి. జిల్లాలో తాజాగా అకాలంలో కురిసిన వర్షాలు, ఈదురుగాలులకు దాదాపు 3 వేల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. ప్రధానంగా ప్రస్తుతం సాగులో ఉన్న మొక్కజొన్న, నువ్వు పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు గుర్తించారు. ఏపుగా పెరుగుతున్న మక్కపంట మొత్తం వాలిపోయింది. ఇందులో సగం పంట పనికి రాదని, కంకులు తెంపడమూ కష్టమేనని రైతులు పేర్కొంటున్నారు. ఇక ఏపుగా పెరుగుతున్న నువ్వు పంట కూడా వాలిపోవడంతో నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

వేల ఎకరాల్లో నష్టం..
ఏటా రెండు సీజన్లలో వర్షాలు, ఈదురు గాలుల కారణంగా పంటలు దెబ్బతింటూనే ఉన్నాయి. వానాకాలం సాగులో సమయానికి వర్షం కురువక విత్తులు భూమిలోనే మాడిపోతున్నాయి. మళ్లీ రెండోసారి విత్తుకుంటే, ఒక్కసారిగా వర్షాలు దంచికొట్టడంతో దెబ్బతింటున్నాయి. జిల్లాలో చాలామంది రైతులు మూడోసారి విత్తుకుంటేనే పంట దక్కుతోంది. ఇక యాసంగి పంటలకూ అదే గోస. కాలం కాని కాలంలో వానలు వచ్చిపడుతున్నాయి. వాటికి ఈదురు గాలులు తోడవుతున్నాయి. ఇటీవల చెడగొట్టు వానలు ఇలాగే వచ్చి ఒక్కసారిగా పంటలను పడగొట్టేశాయి. 2016–17 నుంచి పంటల నష్టాన్ని అంచనా వేసి పంపుతున్నా.. పరిహారం మాత్రం రావడం లేదు.

రెండెకరాల్లో నష్టం..



యాసంగి పంటగ ఈసారి మొత్తం మక్క వేసిన. మొన్నటి ఈదురుగాలులు, వానకు పంట నేలవాలింది. రెండెకరాల్లో నష్టపోయిన. సగానికిపైగా పంట చేతికి రాకుండా పోయింది. ఈసారైనా ప్రభుత్వం పరిహారమిచ్చి ఆదుకోవాలి.
– మంద లింగన్న, రైతు, ధర్మోర, లోకేశ్వరం మండలం

నష్టం వివరాలు పంపించాం..



జిల్లాలో ఇటీవల ఈదురుగాలులు, అకాల వర్షాలకు పంటనష్టం కొంతమేర జరిగింది. ఇందులో మొక్కజొన్న, నువ్వు పంటలు దెబ్బతిన్నాయి. నష్టం అంచనా వేశాం. సంబంధిత రిపోర్టులను ఉన్నతాధికారులకు పంపించాం.
– అంజిప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి

శుభాలనిచ్చే శోభకృత్



- షడ్రుచుల పండుగ ఉగాది
- నేటి నుంచి తెలుగు నూతన సంవత్సరాది
- పంచాంగ శ్రవణానికి ఆలయాల్లో ఏర్పాట్లు

భైంసా: ఏడాది పొడవునా వచ్చే పండుగల్లో చైత్ర శుద్ధ పాడ్యమి నాడు వచ్చే తెలుగువారి మొట్టమొదటి పండుగ ఉగాది. కొత్త సంవత్సరం ఉగాది పర్వదినంతోనే ప్రారంభమవుతుంది. ఈ ఏడాది శోభకృత్ నామ సంవత్సరం బుధవారం నుంచి ఆరంభమవుతోంది. ఉగాది రోజున పంచాంగ పఠనం ప్రత్యేకంగా నిలుస్తుంది. అర్చకులు, పండితులు రాశుల వారీగా తెలియజేసే ఆదాయ, వ్యయాలు, రాజపూజ్యం, అవమానాలను తెలుసుకునేందుకు ప్రజలు ఆసక్తి చూపిస్తారు. పంచాంగ పఠనానికి జిల్లాలోని ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. షడ్రుచుల సమ్మేళనం తీపి(మధురం), పులుపు(ఆమ్లం), ఉప్పు(లవణం), కారం(కటు), చేదు(తిక్త), వగరు(కషాయం) కలిసిన ఉగాది పచ్చడి తెలుగువారికి ప్రత్యేకం. మామిడి కాయలు, వేపపువ్వు, చింతపండు, కొబ్బరి, బెల్లంతో పచ్చడి తయారు చేసి ఆరగిస్తారు.

అంతా శుభమే..
శోభకృత్‌నామ సంవత్సరం అందరికీ శుభాలను పంచుతుందని బాసర ఆలయ ప్రధానార్చకుడు సంజీవ్ పూజారి అన్నారు. బాసరలో ఉగాది సందర్భంగా ఏర్పాట్లు చేశారు. ఉగాది పర్వదినాన సరస్వతి అమ్మవారి ఆలయంలో విశేష అభిషేకం జరుగనుంది. లోక కల్యాణార్థం ఉదయం 10 గంటలకు బ్రహ్మ ధ్వజ పూజ జరిపిస్తారు. అనంతరం పంచాంగ పూజ జరిపి పంచాంగ శ్రవణం చేయనున్నారు. భక్తులకు ఆలయంలో ఉగాది పచ్చడి పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నారు. సాయంత్రం ఆలయంలో పంచాంగ శ్రవణం జరుగనుంది. శోభకృత్ నామసంవత్సరం సర్వజన మేలు కోరి పూజలు జరుపనున్నారు.

అందరికీ శుభాలు..



శోభకృత్ నామ సంవత్సరంలో అందరికీ శుభాలు జరుగుతాయి. ఉగాది పర్వదినం నుంచి ఆరంభమయ్యే ఈ ఏడాది ఆది దేవతగా సూర్యభగవానుడు ఉంటాడు. ఈ శోభకృత్‌నామ సంవత్సరంలో దేశ ఖ్యాతి శిఖరాగ్రాన వెలుగొందనుంది. రైతులకు మంచి పంటలు పండుతాయి. ఈ సంవత్సరంలో 384 రోజులు వస్తాయి. దైవారాధన చేస్తే త్వరితగతిన ఫలితాలు లభిస్తాయి. ఉగాది పచ్చడి తినే సమయంలో ప్రతి ఒక్కరు ఈ శ్లోకం చెప్పుకోవాలి.
''శతాయుష్యం వజ్రదేహం దదాత్యర్థం సుఖానిచ సర్వారిష్ట వినాశంచ నింబకందళ భక్షణమ్..''
– సంజీవ్ పూజారి, బాసర ఆలయ ప్రధానార్చకులు

'పది' పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- పరీక్షల నిర్వహణ కమిషనర్ కృష్ణారావు



వీడియో కాన్ఫరెన్స్‌లో డీఈవో, అధికారులు

నిర్మల్ రూరల్:ఏప్రిల్ 3 నుంచి ప్రారంభమయ్యే 10వ తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని ప్రభుత్వ పరీక్షల నిర్వహణ కమిషనర్ కృష్ణారావు సూచించారు. హైదరాబాదు నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విద్యాశాఖ అధికారులతో మాట్లాడారు. ఈసారి ఆరు పేపర్లే ఉంటాయని పేర్కొన్నారు. ఒక్కో పేపర్‌కు మూడు గంటల సమయం ఉంటుందని తెలిపారు. పరీక్ష సిబ్బంది తప్పకుండా గుర్తింపు కార్డులు ధరించాలని, కార్డు లేనివారిని పరీక్ష కేంద్రంలోనికి అనుమతించొద్దని సూచించారు. సీసీ కెమెరాల ఆధ్వర్యంలో ప్రశ్న పత్రాలు తెరవాలని పేర్కొన్నారు. డీఈవో రవీందర్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో 166 ప్రభుత్వ పాఠశాలల నుంచి 6,124 మంది, 67 ప్రైవేట్ పాఠశాలల నుంచి 2,954 మంది పదో తరగతి పరీక్షలకు హాజరవుతారని తెలిపారు. జిల్లాలో 48 కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఇప్పటికే సీఎస్, డీవోలకు శిక్షణ ఇచ్చామని పేర్కొన్నారు.

విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయాలి
పదో తరగతి పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలని డీఈవో రవీందర్‌రెడ్డి సూచించారు. జిల్లా కేంద్రంలోని సెయింట్ థామస్ పాఠశాలలో ప్రీ ఫైనల్‌లో ఇంగ్లిష్ సబ్జెక్టు ఫలితాలపై ఉపాధ్యాయులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. పరీక్షలో విద్యార్థులకు వచ్చిన మార్కులకు సంబంధించి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల ప్రభుత్వ కేజీబీవీ, స్థానిక సంస్థల, సంక్షేమ పాఠశాలల ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల్లో పరీక్షలకు సంబంధించిన భయాన్ని తొలగించాలని సూచించారు. పరీక్షలో సీ గ్రేడ్ సాధించిన విద్యార్థులకు ప్రత్యేక కార్యక్రమాలు సూచించారు. సమావేశంలో పరీక్షల సహాయ కమిషనర్ పద్మ, సెక్టోరియల్ అధికారులు నర్సయ్య, శ్రీదేవి, ఎంఈవో శంకర్, రవీంద్ర, మధుసూదన్, రామ్మోహన్, ఇంగ్లిష్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పత్తి క్వింటాల్‌కు రూ.12 వేలు చెల్లించాలి



రైతులతో కలిసి మాట్లాడుతున్న రాజు

భైంసారూరల్: క్వింటాల్ పత్తికి రూ.12 వేలు చెల్లించాలని అఖిలభారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె.రాజు డిమాండ్ చేశారు. మండలంలోని హంపోలి గ్రామంలో రైతులు ఇళ్లలో నిల్వ ఉంచిన పత్తిని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రారంభంలో క్వింటాల్ పత్తి ధర రూ.9 వేలు పలుకగా ప్రస్తుతం రూ.7 వేలకు చేరిందన్నారు. భైంసా డివిజన్‌లో 60 శాతం మంది రైతులు పత్తిని ఇళ్లలోనే నిల్వచేసుకుని ధర కోసం ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం పత్తికి కనీస మద్దతు ధర నిర్ణయంలో సరిగా పెట్టుబడులను లెక్కించకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. అధిక వర్షాలతో ఈ ఏడాది దిగుబడులు లేక రైతులు నష్టాలపాలయ్యారని గుర్తుచేశారు. స్వామినాథన్ కమిషన్ రిపోర్ట్ ప్రకారం పెట్టుబడికి 50 శాతం కలిపి ధర నిర్ణయిస్తే రూ.12 వేలు అవుతుందన్నారు. సీసీఐని కమర్షియల్ ట్రేడింగ్‌లో దించాలని, చివరి వరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ రాంచంద్రారెడ్డి, ఏఐకేఎంఎస్ నాయకులు దీనాజీ, దిగంబర్, లక్ష్మణ్, రైతులు ఉన్నారు.

'ఆరోగ్య మహిళ'ను సద్వినియోగం చేసుకోండి

- వైద్య ఆరోగ్యశాఖ జాయింట్ డైరెక్టర్ జాన్‌బాబు

బజార్‌హత్నూర్: మహిళల ఆరోగ్యమే లక్ష్యంగా రా ష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైద్యారోగ్య శాఖ జాయింట్ డైరెక్టర్, ఆరోగ్య మహిళ కార్యక్రమ ప్రత్యేక అధికారి జాన్‌బా బు తెలిపారు. స్థానిక పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన ఆరోగ్య మహిళ కేంద్రాన్ని మంగళవారం తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆరోగ్య సమస్యలు ఉన్న మహిళలు ఇక్కడ వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వారి వెంట మెడికల్ ఆఫీసర్లు శిల్ప, భీంరావ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మ చెంత ఆత్మహత్యాయత్నం

- బాసర ఆలయంలో మణికట్టు కోసుకున్న యువకుడు
- అడ్డుకుని అదుపులోకి తీసుకున్న భద్రతాసిబ్బంది
- గతంలో నాలుగుసార్లు అఘాయిత్యం
- ఆలయంలో ఆత్మహత్యే లక్ష్యంగా రాక..
- విచారణ జరుపుతున్న పోలీసులు


బాసర ఆలయంలో భద్రతా సిబ్బంది అదుపులో ప్రసాద్‌గౌడ్

భైంసా: నిర్మల్ జిల్లా బాసర సరస్వతి అమ్మవారి పాదాల చెంత ఆత్మార్పణే లక్ష్యమంటూ ఓ యువకుడు చేస్తున్న సంఘటన కలవర పెడుతున్నాయి. నిజామాబాద్ జిల్లాకు చెందిన ప్రసాద్‌గౌడ్ మంగళవారం మరోమారు బాసర ఆలయానికి వచ్చి పదునైన కత్తితో మణికట్టు కోసుకుని రక్తార్పణం చేశాడు. ఆ సమయంలో అడ్డుకునేందుకు వచ్చిన భక్తులను, అక్కడున్న సిబ్బందిని కత్తితో బెదిరించాడు. భద్రతాసిబ్బంది అప్రమత్తమై ప్రసాద్‌గౌడ్‌ను అదుపులోకి తీసుకుని బాసర పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తానెందుకు వచ్చానో తెలియదని కత్తి ఎందుకు ఉందని ప్రశ్నించగా, తాను తెచ్చిన బస్తాలో మామిడికాయలు కోసేందుకు వెంట ఉంచుకున్నానని సమాధానమిచ్చాడు. పదేపదే బాసర వచ్చి ఎందుకు ఇలా చేస్తున్నావని ప్రశ్నించగా, సమాధానం దాటవేసే ప్రయత్నం చేస్తున్నాడు.

పదే పదే బాసరకు...
నిజామాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన సిలివేరు ప్రసాద్‌గౌడ్ తల్లిదండ్రులు చనిపోయారు. సోదరుడి దగ్గరే పెరిగి అక్కడే చదువుకున్నాడు. ప్రసాద్‌గౌడ్ ఒంటరిగా ఉండేందుకు ఇష్టపడుతూ మానసికంగా కుంగిపోయాడు. అప్పుడప్పుడు బాసర ఆలయానికి వస్తూ వెళ్లేవాడు. 2016లో తొలిసారి అమ్మవారి చెంత ఆత్మహత్యకు ప్రయత్నించాడు. పదునైన చాకుతో మణికట్టు కోసుకున్నాడు. స్పందించిన ఆలయ సిబ్బంది వెంటనే అప్రమత్తమై అదుపులోకి తీసుకున్నారు. తర్వాత మరో మూడుసార్లు ఆలయంలో ఆత్మహత్యకు ప్రయత్నించారు. స్థానిక భక్తులు, సెక్యూరిటీ సిబ్బంది అప్రమత్తం కావడంతో ప్రాణాలతో బయటపడ్డాడు. కత్తితో, బ్లేడ్‌తో కోసుకున్న ప్రసాద్‌గౌడ్ ఆస్పత్రిలో చికిత్స పొంది అనంతరం కొంతకాలానికి మళ్లీ బాసర వచ్చి ఆత్మహత్యకు ప్రయత్నిస్తూనే ఉన్నాడు.

పండుగలకు ముందు..
ప్రసాద్‌గౌడ్ ఇప్పటికే బాసర శ్రీ జ్ఞానసరస్వతీ ఆలయంలో ఐదుసార్లు ఆత్మహత్యకు యత్నించాడు. బాసరకు వచ్చే సమయంలో మంచిరోజులు, పండుగలు, శుభముహూర్తాలు ముందే చూసుకుంటాడు. దీపావళి సందర్భంగా గతంలోనూ బాసర వచ్చాడు. తాజాగా ఉగాది పర్వదినానికి ఒక రోజు ముందుగా ఇక్కడికి వచ్చాడు. అమావాస్య రోజు అమ్మవారి చెంత ఆత్మహత్య చేసకుంటే స్వర్గానికి వెళ్తాననే మూఢనమ్మకం ఇతనిలో నాటుకుపోయింది. గతంలో గర్భగుడిలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించగా భద్రతాసిబ్బంది అడ్డుకున్నారు. గొంతు, మణికట్టుపై పదేపదే పదునైన కత్తి, బ్లేడుతో కోసుకుని, అడ్డువచ్చినవారిపై తన వద్ద ఉన్న కత్తితో బెదిరించడం అక్కడివారిని చెదరగొట్టడం ప్రసాద్‌గౌడ్ చేస్తుంటాడు. బాసర పోలీసులు, అధికారులు ఇప్పటికే ప్రసాద్‌గౌడ్‌కు పలుమార్లు కౌన్సెలింగ్ ఇచ్చినా ఆయన తీరు మారడం లేదు. మంగళవారం కూడా బాసర పోలీసులు ప్రసాద్‌గౌడ్‌ను అదుపులోకి తీసుకుని మానసికస్థితి ఆధారంగా విచారణ చేస్తున్నారు.

మంత్రి వ్యాఖ్యలు సిగ్గుచేటు

- ఏఐసీసీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్: నెలల తరబడి రేయింబవళ్లు నిరుద్యోగులు కష్టపడి చదువుతుంటే పేపర్ లీకేజీ చేయడం దారుణమని, ఇలాంటివి సర్వసాధారణమని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి వ్యాఖ్యానించడం సిగ్గుచేటని ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ చైర్మన్ ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. మంత్రి వ్యాఖ్యలను ఆయన ఒక ప్రకటనలో ఖండించారు. లక్షలాది మంది నిరుద్యోగుల జీవితాలతో సర్కార్ చెలగాటం ఆడుతోందని పేర్కొన్నారు. నిర్మల్ మున్సిపాలిటీలోనూ 42 ఉద్యోగాలనూ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అమ్ముకున్నారని ఆరోపించారు. ఏళ్లుగా ప్రభుత్వ ఉద్యోగాల కోసం ప్రిపేరవుతున్న నిరుద్యోగుల విషయంలో మంత్రి వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని తెలిపారు. మంత్రిని వెంటనే బర్తరఫ్ చేయాలని, నిరుద్యోగులకు క్షమాపణలు చెప్పాలని మహేశ్వర్‌రెడ్డి డిమాండ్‌చేశారు.

ఎంజేపీ పాఠశాల తనిఖీ

లక్ష్మణచాంద: రాచాపూర్ గ్రామంలోని ఎంజేపీ పాఠశాల, కళాశాలను మంగళవారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఆర్సీవో గోపీచంద్ ఆకస్మిక తనిఖీ చేశారు. భోజనశాలకు వెళ్లి విద్యార్థులకు అందిస్తున్న ఆహారాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్, ఏటీపీ సురేశ్, డీడబ్ల్యూవో నారాయణ, అధ్యాపకులు పాల్గొన్నారు.


విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న గోపీచంద్

అడవులను సంరక్షించాలి


ర్యాలీగా వెళ్తున్న జిల్లా అటవీ శాఖ సిబ్బంది


ర్యాలీలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, కలెక్టర్, డీఎఫ్‌వో

- మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి
- ఘనంగా ప్రపంచ అటవీ దినోత్సవం
- ర్యాలీలో పాల్గొన్న మంత్రి, కలెక్టర్

నిర్మల్‌టౌన్: అడవుల సంరక్షణ అందరి బాధ్యత అని, అడవులు నరికి వేస్తే జీవరాశి మనుగడే ప్రశ్నార్థకమవుతుందని దేవాదాయ, అటవీ, న్యాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. మంత్రి కలెక్టర్ వరుణ్‌రెడ్డితో కలిసి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించి పాల్గొన్నారు. అటవీ శాఖ కార్యాలయం నుంచి ప్రొఫెసర్ జయశంకర్ చౌరస్తా వరకు ర్యాలీ సాగింది. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, పర్యావరణ అభివృద్ధికి అడవులు ఎంతో అవసరమన్నారు. ఈ విషయం తెలియజేయడం కోసమే ప్రపంచ అటవీ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రానున్న తరాలకు మంచి ఆరోగ్యకరమైన వాతావరణం అందించాలనే లక్ష్యంతో సీఎం కేసీఆర్ జంగల్ బచావో- జంగల్ బడావో నినాదంతో 2015 నుంచి ఏటా హరితహారం కార్యక్రమం నిర్వహిస్తున్నారని తెలిపారు. ఎనిమిదేళ్లలో 273 కోట్లకుపైగా మొక్కలు నాటామన్నారు. తెలంగాణలో 2015 నుంచి 2021 వరకు పచ్చదనం శాతం 7.70% పెరిగిందని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం అడవుల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యల ఫలితంగా వన్య మృగాల సంఖ్య గణనీయంగా పెరిగిందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారి సునీల్ హిరామత్, మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక రమణ, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పాకాల రాంచందర్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు రాము, జిల్లా అధికారులు, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

విషాహారం తిని 15 గొర్రెలు మృత్యువాత

కుంటాల: మండలంలోని అంబకంటి గ్రామంలోని దేవన్నకు చెందిన 15 గొర్రెలు మంగళవా రం మృతి చెందాయి. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. దేవన్నకు చెందిన 105 గొ ర్రెలు సోమవారం సాయంత్రం విషా హారం తిన్నా యి. మంగళవారం గొ ర్రెల మందను మేతకు తీసుకువెళ్లే క్రమంలో 20 అస్వస్థతకు గురయ్యా యి. ఇందులో 15 కొట్టంలోనే మృతి చెందగా, మరో ఐదు తీవ్ర అస్వస్థతకు గురయ్యా యి. విషయం తెలుసుకున్న పశువైద్యాధికారి ప్రకాశ్, జేవీవో శశిధర్, సిబ్బంది సాయిరాం, లింగన్న మిగతా గొర్రెలకు చికిత్స అందించారు. మృతి చెందిన గొర్రెల విలువ రూ.1.50 లక్షలు ఉంటుందని దేవన్న తెలిపాడు.

సినీ ఫక్కీలో చైన్ స్నాచింగ్


బాధితురాలు గంగుబాయి

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో దుండగులు సినీ ఫక్కీలో దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఇటీవల ఓ కంటైనర్‌ను హైజాక్ చేసి దోపిడీకి పాల్పడిన విషయం తెలిసిందే. తాజాగా మంగళవారం ఉదయం 5.30 గంటల ప్రాంతంలో ఓ చైన్ స్నాచర్ రెచ్చిపోయాడు. మహిళ మెడలోంచి బంగారు గొలుసును అపహరించాడు. సీసీ ఫుటేజ్‌లో వాహనంపై వెళ్తున్న మహిళతో పాటు దుండగుడు కనిపిస్తున్నా హెల్మెట్ పెట్టుకొని ఉండడంతో ముఖం కనిపించడంలేదు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన వన్‌టౌన్ పోలీసులు సీసీ ఫుటేజ్ ఆధారంగా దొంగను పట్టుకునేందుకు చర్యలు చేపడుతున్నారు. చైన్ స్నాచింగ్‌కు గురైన బాధితురాలు గంగుబాయి తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ పట్టణంలోని పాత హౌసింగ్ బోర్డులో గంగుబాయి నివాసముంటోంది. మున్సిపల్‌లోని ఆడిట్ కార్యాలయంలో సబార్డినేటర్‌గా విధులు నిర్వహిస్తోంది. ఈమె బంధువు బస్టాండ్ సమీపంలోని తిరుమల ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఉదయం ఆస్పత్రికి స్కూటీపై బయల్దేరింది. ఆస్పత్రి అడ్రస్ తెలియకపోవడంతో ఆమె బస్టాండ్ వెనుకవైపు విద్యానగర్ నుంచి ఇంటికి తిరిగి వెళ్తోంది. ఈ క్రమంలో కొమురంభీం చౌక్ దాటిన తర్వాత బిర్యానీ హౌస్ ముందు పల్సర్ బైక్‌పై ఓ వ్యక్తి హెల్మెట్ పెట్టుకొని తన వాహనం వెంట వచ్చినట్లు తెలిపింది. ఒక్కసారిగా తన మెడలోంచి రెండు తులాల బంగారు గొలుసు లాక్కెళ్లినట్లు పేర్కొంది. ఈ సమయంలో ఆమె స్కూటీ నుంచి కింద పడగా స్వల్ప గాయాలైనట్లు వాపోయింది. అరుపులు వేయడంతో స్థానికులు అక్కడికి చేరుకున్నారు. అప్పటికే దొంగ బైక్‌పై పరారయ్యాడు. కలెక్టరేట్ వైపు వెళ్లినట్లు స్థానికులు చెబుతున్నారు. ఆ రూట్‌లో సీసీ కెమెరాలు లేకపోవడంతో నిందితుడు కనిపించకుండాపోయాడు.

భయం గుప్పిట్లో ఝరి(బి)

- అటవీ ప్రాంతంలో చిరుత సంచారం
- పాదముద్రలను గుర్తించిన అటవీశాఖ అధికారులు


అటవీ అధికారులు గుర్తించిన చిరుత పాదముద్ర

తానూరు: నిర్మల్ జిల్లా తానూరు మండలం ఝరి(బి) అటవీ ప్రాంతంలో చిరుత సంచారంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. గ్రామానికి చెందిన బొడ్డోల్ల సాయినాథ్ సోమవారం తన మొక్కజొన్న చేనుకు కాపలాగా వెళ్లగా చేనులో చిరుత కనిపించింది. దీంతో గ్రామస్తులకు ఫోన్ ద్వారా సమాచారం అందించాడు. గ్రామస్తులు, పరిసర ప్రాంత రైతులు అక్కడికి చేరుకున్నారు. రైతులు చేసిన శబ్దాలు చిరుత పులి అటవీ ప్రాంతంలో వెళ్లిపోయింది. సమాచారం తెలుసుకున్న అటవీశాఖ బీట్ అధికారి మహేశ్ మంగళవారం ఝరి(బి) శివారులోని సాయినాథ్ చేను వద్దకు వెళ్లి పరిశీలించారు. పాదముద్రలను గుర్తించారు. రైతులు అటవీ ప్రాంతంలోకి ఒంటరిగా వెళ్లొద్దని సూచించారు.

భయం భయం ...
చిరుత సంచారంతో ఝరి(బి) గ్రామానికి చెందిన రైతులు వ్యవసాయ భూముల వద్దకు వెళ్లేందుకు భయపడుతున్నారు. గ్రామానికి చెందిన రైతుల చేలన్నీ గుట్ట ప్రాంతంలోనే ఉన్నాయి. సోమవారం చిరుత కనిపించడంతో పంటలకు కాపలా వెళ్లడానికి జంకుతున్నారు. అటవీ శాఖ అధికారులు చిరుతను గుర్తించి తరలించాలని కోరుతున్నారు.

క్రిమినల్ కేసు నమోదు చేయాలి

నార్నూర్: కెరమెరి మండలం అగర్వాడ గ్రామానికి చెందిన ఆదివాసీ యువతి మృతికి కారణమైన లావుడ్యా రమేశ్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని తుడుందెబ్బ ఆధ్వర్యంలో ఆదివాసీలు ఆందోళనకు దిగారు. మంగళవారం మండల కేంద్రంలోని గాంధీచౌక్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ విద్యార్థి సంఘం, తుడుందెబ్బ జిల్లా నాయకుడు దాదిరావు మాట్లాడారు. అగర్వాడ గ్రామానికి చెందిన జుగ్నాక రేణుక నిర్మల్ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఏఎన్ఎంగా పనిచేస్తోందని తెలిపారు. లావుడ్యా రమేశ్ ఆమెను ప్రేమించి సహజీవనం చేశాడని, ఈక్రమంలో ఆమె గర్భం దాల్చిందని పేర్కొన్నారు. డెలివరీ సమయంలో చిత్రహింసలు పెట్టడంతో మరణించిందని ఆరోపించారు. ఆమె మృతదేహాన్ని ఇంటికి తీసుకువెళ్లకుండా కెరమెరి మండల కేంద్రంలో వదలివెళ్తున్న క్రమంలో అతడిని పట్టుకున్నట్లు తెలిపారు. అతడిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు కొట్నాక్ కృష్ణ సార్‌మేడి, పెందూర్ సంతోష్, ఓనేరావు, బాపురావు, అంబదాస్ తదితరులున్నారు.

వికటించిన నాటువైద్యం

- భార్య మృతి.. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న భర్త

ఆదిలాబాద్‌టౌన్: నాటు వైద్యం వికటించి వృద్ధురాలు మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని భుక్తాపూర్ కాలనీకి చెందిన సిల్వర్ రాజన్న, ఆయన భార్య లక్ష్మి (75) కొంత కాలంగా కాళ్ల నొప్పులు, ఇతర సమస్యలతో బాధ పడుతున్నారు. ఆస్పత్రిలో వైద్యం చేయించుకుంటున్నా నయం కాలేదు. నొప్పుల బాధలు, షుగర్‌తో ఇబ్బందులకు గురికాగా, ఎవరో నాగముష్టి వేరు తాగితే నొప్పులు తగ్గుతాయని చెప్పారు. దీంతో వారిద్దరూ మంగళవారం ఉదయం వేర్లను నీళ్లలో నానబెట్టిన అనంతరం తాగారు. కొద్దిసేపటి తర్వాత లక్ష్మి అపస్మారక స్థితికి చేరుకుంది. రాజన్నకు తల తిరగడంతో కుటుంబీకులు వారిని చికిత్స కోసం రిమ్స్‌కు తరలించారు. ఆస్పత్రికి చేరుకోక ముందే లక్ష్మి మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. రాజన్న కోలుకుంటున్నాడు. మృతురాలికి ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలున్నారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి యువకుడి మృతి

నర్సాపూర్(జి): మండలంలోని అంజనీతండాకు చెందిన రాథోడ్ రామకృష్ణ (24) ద్విచక్రవాహనం అదుపు తప్పి మృతి చెందాడు. ఏఎస్ఐ మాన్‌సింగ్ తెలిపిన వివరాల ప్రకారం.. రామకృష్ణ సోమవారం నర్సాపూర్(జి)లో పని ముగించుకొని రాత్రి 10 గంటలకు ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్తున్నాడు. మార్గంమధ్యలో ద్విచక్రవాహనం అదుపుతప్పి రోడ్డు పక్కనున్న చెట్టుకు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రామకృష్ణ తలకు బలమైన గాయాలై తీవ్ర రక్తస్రావమైంది. గమనించిన గొల్లమాడ గ్రామస్తులు రామకృష్ణ కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. 108లో భైంసా ఏరియా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ అదేరోజు రాత్రి మృతి చెందాడు. మృతుడి సోదరుడు రాజేశ్వర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు. కాగా, హెల్మెట్ ధరించి ఉంటే రామకృష్ణ బతికేవాడని గ్రామస్తులు భావిస్తున్నారు.

ఉరేసుకొని మహిళ ఆత్మహత్య

ముధోల్: మండలంలోని నయాబాదీ కాలనీకి చెందిన రుఖీయా బేగం (27) ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. కొద్దిరోజులుగా రుఖీయా బేగం మానసిక పరిస్థితి బాగా లేదు. ఈక్రమంలో మంగళవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

వాగులో గల్లంతై పశువుల కాపరి మృతి

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని భీంసరి శివారు ప్రాంతంలో వాగు దాటుతూ పశువుల కాపరి గొంటిముక్కల గంగన్న (60) మృతి చెందాడు. ఎస్సై నాగనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. భీంసరి శివారు ప్రాంతంలో మంగళవారం గంగన్న పశువులను మేపుతున్నాడు. కొన్ని పశువులు వాగు దాటి వెళ్లాయి. వాటి కోసం వెళ్తున్న గంగన్న వాగు దాటుతూ నీటిలో గల్లంతై మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.